




# నాటు పడవా... రావినీడా

-డా.యల్.కె.సుధాకర్

**పడవ నిండింది. పడవ రాముడి గుండె నిండింది. కడుపు నిండా ఆనందం పండింది. అదృష్టం కొద్దీ 'వాల్లిం'కా రాలేదు. వాళ్లొచ్చే లోపుగా మరో రెండు ట్రిప్పులు వెయ్యగలిగితే చాలు... మళ్ళా ఆదివారం దాకా డబ్బవసరాలు తీరిపోయినట్టే. మరో రెండు ట్రిప్పులు. అప్పటికే వెంకటిగాడూ, రవణగాడూ వాళ్ల పడవల్తో మూడేసి ట్రిప్పు లేసేసుకున్నారు.**

**మెరిసిన కళ్ల ముందు**
**కృష్ణవేణి కనబడింది.**
**గంగని కడుపులో**
**మోస్తున్న నెలలు**
**నిండిన కృష్ణవేణి.**
**ప్రతిరోజూ కొబ్బరచ్చు**
**తెచ్చియ్యమని**
**పోరుబెట్టిన నిండు**
**గర్భిణి కృష్ణవేణి.**
**గంగని కని, తన**
**చేతుల్లో పెట్టి,**
**జ్ఞాపకమై పోయిన -**
**వెళ్ళిపోయిన**
**కృష్ణవేణి...**

వేలకొద్దీ వాయులీనాల వేల్లాడుతోన్న సంగీతపు చిలక్కొయ్యలా వున్న రావిచెట్టు ఆకుల మీదుగా శృతి చేయబడుతోన్న సంగీతానికి, గోదారలల ప్రక్క వాయిద్య లయ విన్యాసం హాయిగా సాగుతుండగా నిండు పడవని నెమ్మదిగా నీళ్లలోకి త్రోసి గెడని గోదాట్లోకి దించి ప్రయాణం మొదలెట్టాడు రాముడు. అపుడే ప్రయివేటులోంచొచ్చి పుస్తకాల నంచీతో సహా పడవలో కెక్కిన కూతురు గంగమ్మతోసహా ఆ పడవలో పదహారు మంది జనం. ఓ వేపున పూర్తి ముస్తాబులో హరిదాసు గోదారవతల లంకల్లోకి వెళ్తున్నాడు.

గంగని చూడగానే ముచ్చటపడ్డ చేపలోడు ముద్దు చేసి ఎత్తుకోబోయేడు. 'ఛిఛీ! నన్నెత్తుకోకురా! సేపలోడా! నేన్నీ దగ్గరికి రాను' అంది గంగ ఛీ కొడుతూ. అసలే చేపలోడు. పైగా పొగాకు కంపు. గంగ నిజంగానే స్వచ్ఛ గంగలా ఉంటుంది. ఎనిమిదెళ్లి తొమ్మిదేళ్లొచ్చాయ్. చేపలోడు చక్కగా నవ్వేడు. రాముడు కూతురి వంక ఎంచక్కా చూసేడు. రేవునించి లంకల్లోకి మూటల మీద బట్టలు తీసుకెళ్లి అమ్ముకునే సత్యనారాయణ దగ్గర కొన్న పావడా, జాకెట్టు, గోదారి పాయల్లాంటి జుట్టు - జడేసుకున్నాక కోనసీమ పచ్చదనం లాంటి ఆకుపచ్చ రిబ్బను సగం ముడివీడి రెపరెపలాడుతో వేల్లాడుతోంది.

గంగ నవ్వితే గోదారి గలగలమంటుంది.

పడవలో మరోవేపు ఆరుగురు కుర్రాళ్లు - లంకల్లోకి షికారు బయల్దేరారు. జేబుల్లో మందు సీసాలు - చేతుల్లో కూల్‌డ్రింక్ సీసాలు. అందరి వయసూ ఇరవైలోపే. అందులో నలుగురు కుర్రాళ్లు ఇంటర్ పాసయ్యేరు. మిగతా ఇద్దరూ తప్పారు. రిజల్టు వచ్చి రెండు రోజులయింది. తప్పిన వాళ్లకి సానుభూతి నందించడం కోసం పాసయిన వాళ్లు సేద దీరుస్తూ ఇచ్చే పార్టీ మరి కొద్దిసేపట్లో గోదారొడ్డున లంకలో ప్రారంభం కాబోతోంది. ఫెయిలయిన ఇద్దర్లో ఒకడు అన్వేష్ కొంచెం తృప్తిగానూ, కొంచెం తడబాటుతోనూ జేబు తడుముకుంటున్నాడు మాటిమాటికీ. చల్లగా తగులుతోంది మందుసీసా. అతడి చుట్టూ అప్పటిదాకా తనని హింసించిన (?) కార్పొరేట్ కాలేజి తాలూకూ బీభత్స వాతావరణం ప్రేత నృత్యం చేస్తూ భయపెడుతోంది. చదివిన చదువు... చదివినా తలకెక్కని చదువు - ఇష్టంలేని సబ్జెక్టుల బరువైన చదువు - రాని చదువు - రాయలేని చదువు... వేదన వింత

మృగంలా అతడి చుట్టూ సంచరిస్తోంది.

అంత రద్దీ పడవలోనూ అతడు ఒంటరి. సునామీ ముందరి సముద్రంలా వుంది - ఆ కుర్రాడి మనసు. పడవ సాగిపోతోంది. వాయువు వాయులీన నాదంతో గోదారలల ప్రక్క వాద్య సహకారం నేపథ్యంలో, కూతురు గంగమ్మని ప్రేమగా చూస్తూ పాటందుకున్నాడు రాముడు పొడవాటి గెడతో గోదారిలో దారి చేసుకుంటూ... ఇలా...

'నావ సాగిపోతోందీ చుక్కాని లేకుండా

వలపు గాలి విసురుతోంది... మనసు తేలిపోతోందీ...'

'ఏహె! పాటాపు! ఎదవ పాట!' అన్నాడు విసుగ్గా అన్వేష్.

'ఏంటో! ఈ కాలపు కుర్రాళ్లు! పెద్దతరం - చిన్నతరం లేవు. ఇంగిలిపీసు చదువుల్లో వయసులో పెద్దోళ్లని గౌరవించమని సెప్పర్లాగుంది' అంటూ సణుక్కుంది పడవలో మరో మూల కూర్చున్న దోసకాయల మామ్మ - లంకల్లోంచి దోసకాయలు తీసికొచ్చి రేవులో అమ్ముకుంటూ జీవనం సాగించే ముసలమ్మ.

రాముడు పాటాపేసేడు. నావ సాగిపోతోంది. గోదారీ, గంగమ్మా చిన్నబుచ్చుకున్నారు. చిన్నబుచ్చుకున్నప్పుడు నా కూతురు బంతి పువ్వులావుంటుందిరా!' అన్నాడు రాముడు చుక్కానీ పట్టుకున్న చిన్నాగాడితో. అలిగిన కూతుర్ని మచ్చిక చేసుకోడమెలాగో తెలిసి, నవ్వుతా దాని బుగ్గలు పుణికి, జేబులోంచి కొబ్బరి అచ్చు తీసి అందించాడు. పందార పాకంతో చేసిన కొబ్బరచ్చుని చూడగానే గంగ నవ్వింది. గోదారి గలగల లాడింది. కోనసీమ రిబ్బను రెపరెపలాడింది.



గంగ తింటుంటే తండ్రి రాముడి కడుపు నిండింది. కళ్లు మెరిసాయి.

మెరిసిన కళ్ల ముందు కృష్ణవేణి కనబడింది. గంగని కడుపులో మోస్తున్న నెలలు నిండిన కృష్ణవేణి. ప్రతిరోజూ కొబ్బరచ్చు తెచ్చియ్యమని పోరుబెట్టిన నిండు గర్భిణి కృష్ణవేణి. గంగని కని, తన చేతుల్లో పెట్టి, జ్ఞాపకమై పోయిన - వెళ్ళిపోయిన కృష్ణవేణి...

చెమ్మగిల్లిన కళ్లొత్తుకున్నాడు రాముడు.

పడవ ఆవలొడ్డు తాకింది.

* * *

అప్పటికే పల్లంశెట్టి తాలూకూ మర పడవ అక్కడ లంగరేసుకుంది.

'ఏరా! ఎన్నిసార్లు చెప్పాలా నీకు! కూలోల్ని తప్ప పాసెంజర్లని తీసుకు రాకూడదని... శెట్టిగారికి తెల్సిందంటే అంతే... అయిపోతావ్' అన్నాడు రంగడు. రాముడు ఏమీ మాట్లాడ లేదు. ఆగిన పడవలోంచి ఒక్కరొక్కరుగా దిగి వెళ్తున్నారు. చివరగా చేతులందించిన గంగమ్మని ఎత్తుకుని ప్రేమగా ముద్దాడేడు. రేవులో ముఖం చేతులూ కడుక్కున్నాడు. చెట్టు నీడలో సేదదీరేడు.

అతడి పడవ ప్రక్కనే మరబోటు నవ్వుతోన్న బ్రహ్మారాక్షసిలా ఉంది.

* * *

ప్రస్తుత ప్రపంచంలో పేటెంట్ కాని వస్తువేదీ లేనట్లు, పడవల రేవుని పేటెంట్ చేద్దామని చూస్తున్నాడు పల్లంశెట్టి - అనధికారికంగా. అందులో భాగంగానే రెండు మర పడవల్ని దించేడు పోయిన్నెల. ఒకటి పాపికొండల దాకా స్పెషల్ టూర్ ప్యాకేజి. ఒకటి స్థానికంగా బోటు షికారుకి. గొంతుల్నీ, గుడ్డల్నీ చించుకుంటూ అదే సంగీతమని భ్రమింపజేసే పాటలు పెట్టేడు పడవల్లో. గోదారి బోటు షికారుని పూర్తిగా వ్యాపారాత్మకంగా మార్చేస్తున్నాడు. ఇన్నేళ్లుగా ఆ మాటకొస్తే ఇన్ని తరాలుగా గోదారి తల్లినే నమ్ముకున్న పడవ వాళ్ల నోట్లో దుమ్ము కొడుతున్నాడు.

మామూలుగానే పోలీసు బలగం అతడి వేపే పన్జేస్తోంది. రెండు పడవలూ వచ్చిన రెండు వారాలకి రేవులో పడవల వాళ్లందరితో మీటింగ్ పెట్టాడు పల్లంశెట్టి. దాని ప్రకారం - ఎవరూ బోటు షికారుకి నాటు పడవల్లో ప్రయాణీకుల్ని తీసికెళ్ళకూడదు. కేవలం లంకల్లో పనులకెళ్లే రోజువారీ కూలీలని మాత్రమే తీసికెళ్ళొచ్చు. అదయినా ఎందుకంటే... వాళ్లు మురికి మనుషులు - మరపడవలు మాసిపోతాయ్ కాబట్టి. కొంత కాలానికి వాళ్ళు కూడా శుభ్రమైన కూలీలు (?)గా మారిపోతే... అప్పుడు వాళ్ళని కూడా తీసికెళ్లొద్దంటాడు పల్లంశెట్టి. అది వేరే సంగతి. ఇలా కేవలం కూలీలను మాత్రమే తీసికెళ్తూ తీసికొస్తూ పడవలెయ్యడం నష్టంతో కూడిన వ్యాపారం. కాబట్టి ఇక రేవులో పడవలోళ్లు పడవలెయ్యడం మానేయాలి. గోదారినే నమ్ముకుని, గోదారిపై తప్ప బ్రతకలేనోళ్లు కాబట్టి... వీళ్లకి... ప్రత్యామ్నాయ మార్గంగా... పల్లంశెట్టి మరపడవల్లో ఉద్యోగాలివ్వబడతాయ్.

'నీ యాపారం నీది. మా యాపారం మాది. నీకేమైనా ఎవరేనా గుత్త కిచ్చేరా గోదారినీ పడవరేవునీని!!' అన్నాడు ఆవేశంగా గోపిగాడు.

పల్లంశెట్టి రాజకీయపు ప్రేమపూర్వక నవ్వొకటి నవ్వేసి భళ్ళున... 'లేదనుకో! ఏదో మీ మంచి కోరి. ఎలాగా, నా మరపడవ చూసినోళ్లు మీ నాటుపడవ లెక్కరు కదా! అందుకని ముందుగానే మీకు సహాయపడదావని! అయినా మీ ఇష్టం' అన్నాడు మీటింగ్ ముగిస్తూ.

ప్రస్తుత ప్రపంచంలో పేటెంట్ కాని వస్తువేదీ లేనట్లు, పడవల రేవుని పేటెంట్ చేద్దామని చూస్తున్నాడు పల్లంశెట్టి - అనధికారికంగా. అందులో భాగంగానే రెండు మర పడవల్ని దించేడు పోయిన్నెల.

ఆ మర్నాటి సాయంత్రం గోపిగాణ్ని పోలీసులరెస్టు చేసేరు. రాత్రి రాత్రంతా కుళ్లబొడిచేసేరు. అభియోగం ఏంటంటే దొంగసారాని లంకల్లోంచి అక్రమ రవాణా చేస్తున్నందుకన్నారు. సరిగ్గా అక్కడికి రెండు వారాల క్రితమే... అక్కడి 'డ్వాక్రా' గ్రూపు మహిళలతో కలిసి లంకల్లో కాపుసారా బట్టీలు ధ్వంసం చేసీ, అందుకు జిల్లా కలెక్టరు నుండి అవార్డులు అందుకున్న పోలీసులే... ఇప్పుడీ అభియోగం మోపారు.

ప్రపంచ బ్యాంకు వాడిలాగానే... పల్లంశెట్టి కూడా ఎపుడోగానీ బయటకు రాడు... అంటే తెర మీదికి... వస్తే మాత్రం ఇలానే వస్తాడు.

ఇది జరిగిన రెండ్రోజులకి రేవులో సగం మంది పల్లంశెట్టి మరపడవల్లో ఉద్యోగాల్లో చేరిపోయారు. పడవల్లో




రచయిత పరిచయం

యల్కె సుధాకర్‌గా పాఠక లోకానికి సుపరిచితుడైన లంక కనక సుధాకర్ స్వస్థలం తూర్పు గోదావరి జిల్లా అంగర.వేళంగిలో వెటర్నరీ డాక్టరుగా పని చేస్తున్నారు. సుధాకర్ తల్లి దండ్రులు లత, భూషణం ఇద్దరూ ఉపాధ్యాయులే. ఇప్పటి దాకా 40 కథలు, కొన్ని కవితలు ప్రచురితమయ్యాయి. 2003లో 'కొబ్బరాకు' కవితా సంకలనం, 2006లో 'గొబ్బిపూలు' కథా సంకలనం వెలువరించారు. 2003 ఆంధ్ర భూమి సంక్రాంతి కథల పోటీలో ప్రథమ బహుమతి పొందారు. స్వాతి, తానా, ఆటా, నిర్వహించిన పోటీల్లో కూడా బహుమతులందుకున్నారు.

**చిరునామా: డా.యల్.కె.సుధాకర్, 9-453/2,**
**సౌజన్యా బిల్డింగ్స్, రమణయ్యపేట**
**కాకినాడ 533 005.**


చిన్నచిన్న పనుల నుండి, పడవలు శుభ్రంగా ఉంచే పనుల దాకా చిన్నపాటి ఉద్యోగాలు.

'చివరికి మనోళ్ళతో పారిశుధ్ధ్య పనులు చేయిస్తున్నారా!?' అంటూ వాపోయేడు రాముడు. పల్లెపట్టు ఆచారాన్ని వదిలేసి పట్నపు అలవాట్లు తప్పనిసరై అలవాటు చేసికోవాల్సి రావడంలోని బాధ అతడి కన్నుల్లో కన్నీటి వానైంది. తన అస్తిత్వాన్ని వదిలించుకోవాల్సి రావడంలోని విషాదమది!

బాగా ఆలోచించుకున్నాక, రాముడూ, వెంకటీ, రవణా తమ పడవల్ని తామే నడుపుకొందికి నిర్ణయించుకున్నారు.

పల్లె సంప్రదాయాల్ని మోసుకు తిరుగుతున్నాయ్ నాటు పడవలు అట్నుంచిటు ఇట్నుంచటూ...

ఆదివారాలు గోదారిలో బోటు షికారుకెళ్ళే సందర్శకులెక్కువగా వుండడం... ఆదాయం బావుండడం జరుగుతోంది. 'వాళ్లొ'చ్చి, ఉన్నపాటున అప్పటిదాకా సంపాయించిందంతా ఊడ్చుకు పోతున్నారు. గోదారి తల్లికి మ్రొక్కీ, గంగ మొఖం చూసీ ఇవ్వాళ ట్రిప్పులేస్తున్నాడు రాముడు. మూడో ట్రిప్పు అయిపోతే చాలు... వారానికి సరిపడా గ్రాసం... సరిగ్గా మూడో ట్రిప్పు నిండు పడవ బయల్దేరబోతోండగా వచ్చేసేరు...

... వాళ్ళు...

* * *

అదెంత నిశ్శబ్దంగా జరిగిందంటే

గోదారలల ఘోష తప్ప మరే శబ్దమూ లేని నిశ్శబ్ద విషాదం నేపథ్యంలో రాముడు పడవలో వాళ్లందర్నీ కిందికి దింపేసేడు. పోలీసుల్ని చూడగానే ఏడ్వడం మొదలెట్టింది గంగ. బహుశా పోలీసుల్ని చూడగానే మంచివాళ్ళు భయపడేదీ, పిల్లలు ఏడుపు లంకించుకునేదీ ఈ భూగోళం మీద ఒకే ఒక్క దేశంలోనను కుంటా. ఏడుస్తున్న గంగని భుజానేసుకుని... సెల్‌ఫోన్లో మాట్లాడు మెట్లు దిగుతోన్న హెడ్‌కానిస్టేబుల్ నర్సింహకి, దూరంగా రేవులో మరో వేపుకి పోయాడు రాముడు. మాట్లాడ్డం పూర్తయ్యాక క్రింది మెట్టు మీదికి చేరుకున్న హెడ్డు నర్సింహ ఇదంతా తెలిసీ, గమనించనట్టే నటిస్తూ

'రేయ్! ఇలా! రారా!' అన్నాడు.

'ఊర్కోమ్మా!' అంటూ గంగని సముదాయిస్తూ...

(మిగతా 11వ పేజీలో)

(9వ పేజీ తరువాయి)

'దింపేసేనండందర్నీ' అన్నాడు భయంభయంగా.

'మరవతలోళ్ళు?!' నోట్లో గుట్కాని తుపుక్కున ఉమ్ముతూ అడిగేడు హెడ్డు.

బిగ్గరగా ఏడుస్తోన్న గంగని క్రిందికి దించి... తల పాగా విప్పి తువ్వాలు చంకలో పెట్టుకుని, చేతులు కట్టుకుని 'ఆదోరం బాబూ! రెండంటే రెండే ట్రిప్పులండి... అంతే!' అన్నాడు వినయంగా.

మూడక్షరాల బూతు మాటొకటి తిట్టి 'ఎవడిచ్చాడ్రా లైసెన్సు నీకు'

'గోదారమ్మనే నమ్ముకున్నోళ్ళం. మాకు లైసెన్సేంటి బాబూ' అన్నాడు రాముడు.

'ఎంట్రెదురు సెప్తున్నావ్! మొత్తం ఎంతుంది జేబులో తియ్' అంటూ చెయ్యి పెట్టి జేబులో ఉన్నదంతా లాక్కున్నాడు. గంగ ఏడుస్తూనే ఉంది బిగ్గరగా. చుట్టూ జనాలు చోద్యం చూస్తున్నారు. వాళ్లని కూడా ఓసారి చుట్టూ చూసి...

'గోదారి మధ్యలో ఏవన్నా అయితే ఏం చేయగలర్రా మీరు? బాధలన్నీ మాకు గానీ?' అన్నాడు గుట్కా నోటితో.

చివుక్కున తలెత్తి చూసేడు రాముడు. గంగ ఏడుపింకా ఎక్కువైంది.

'ముప్పై రెండేళ్లుగా పడవ మీదే బ్రతుకుతున్నోళ్ళమండీ. గంగ తల్లిన్నమ్ముకున్నోళ్ళం సార్! ఏం అవదండి' అన్నాడు దృఢంగా - నిలబడి చూస్తోన్న జనాల సాక్షిగా. వున్నట్టుండి వచ్చిన ఈ సమాధానం - ఆ పోలీసోడి ఆత్మాభిమానాన్ని భళ్లున బద్దలు కొట్టింది. అంత మంది జనం ముందు ఓ పోలీసోణ్ని, ఓ దిక్కుమాలిన పడవోడు ఇంతిదిగా ఎదిరించడవే? అని కుమిలిపోయాడు. ఇదంతా ఎవడో వ్యాపారస్థుడి కోసం తన విధుల్ని ప్రక్కనపెట్టి చెలాయిస్తున్న జులుమన్న సంగతి ఆ క్షణంలో మర్చిపోయాడు. తన స్వంత అస్తిత్వానికే దెబ్బ తగిలినట్టు విలవిలలాడేడు.

ఆత్మాభిమానానికి, వ్యాపారానికి అం...త లింకుంటుందని అం..త.. కోపమొచ్చేదాకా అతడికే తెలీదు. నర్సింహ, ఉగ్ర నర్సింహుడయ్యేడు. కాకపోతే చెడ్డ పనిలో.

'ఎదురు సెప్తున్నావేంట్రా! ఎదవ ... కొడకా!' అంటూ రాముణ్ని చెంప చెళ్లుమనిపించేడు.

రావాకుల వాయులీనాలు ఆగిపోయాయి. గోదారి స్తంభించింది. వెర్రిబాగుల గంగమ్మ వెర్రిచూపులు చూసింది. రాముడు నిశ్చేష్టుడయ్యేడు. జనం భయపడ్డారు. నిశ్శబ్దం ఆవరించింది రేవంతా. నర్సింహ సెల్ మ్రోగింది.

'అయిపోయిందార్! సెటిల్ చేస్సి పంపేస్తాన్సార్!' అని ఫోన్ ఆఫ్ చేసి, రాముడివేపు తిరిగి 'హెహ్హెహె! వెళ్లు! వెళ్లి మంచి పనులు చెయ్యండి కొడకల్లారా!' అన్నాడు... జనాలు వింటుండగా.

రాముడింకా షాక్‌లోనే ఉన్నాడు. తేరుకోలేనంతగా... గంగమ్మ ఏడుపు ఆపి వెక్కుతోంది. అలల ఊయల్లో చిన్నగా కదుల్తోన్న పడవలో వెక్కివెక్కి శోషొచ్చినట్టు పడిపోయి పడవ బల్ల మీదే నిద్రలోకి జారుకుంది.

చిన్నాగాడు నిశ్శబ్దంగా పై మెట్టు మీద ఓ మూల నిలబడి ఉన్నాడు. రవణా, వెంకటీ జాడ లేరు. పడవలు మాత్రం ఉన్నాయ్. జనాలకి ప్రస్తుతం వరకు మంచి షో. నర్సింహ అసహనంగా ఇంకా మెట్ల మీదే తిరుగుతున్నాడు సెల్‌ఫోన్లో మాట్లాడుకుంటూ.

గంగమ్మ ఒళ్ళు మరిచి నిద్రోతోంది. కోనసీమ లాంటి ఆకుపచ్చ రిబ్బను ముక్క గోదారి పాయల్లాంటి జుట్టూ నిస్సహాయంగా వేల్లాడుతున్నాయ్. ఏడ్చి అలిసిపోయిన బుగ్గలు అలసటగా వున్నాయ్.

రాముడికీ ఆత్మాభిమానం దెబ్బతింది. తిట్టినందుక్కాదు. లాగిపెట్టి చెంప పగలగొట్టినందుకూ కాదు. 'మధ్యలో ఏవన్నా అయితే ఏం చేయగలర్రా మీరు?' -



**రాముడికీ ఆత్మాభిమానం దెబ్బతింది. తిట్టినందుక్కాదు. లాగిపెట్టి చెంప పగలగొట్టినందుకూ కాదు. 'మధ్యలో ఏవన్నా అయితే ఏం చేయగలర్రా మీరు?' - ఈ మాట అతడి హృదయాన్ని ఛిద్రం చేసేస్తోంది. ఆత్మాభిమానానికి వ్యాపారానికి లింకుంటుందన్న విషయం రాముడికి తెలీదు...**

ఈ మాట అతడి హృదయాన్ని ఛిద్రం చేసేస్తోంది. ఆత్మాభిమానానికి వ్యాపారానికి లింకుంటుందన్న విషయం రాముడికి తెలీదు... ఎందుకంటే రాముడు వ్యాపారస్థుడూ కాదు ప్రభుత్వోద్యోగీ కాదు కాబట్టి. రాముడికి సంబంధించినంత వరకూ పడవ నడపడం ఓ సంప్రదాయం... ఒక జీవన విధానం తద్వారా బ్రతుకుతెరువు. అంతే. తన ఆత్మాభిమానాన్ని దెబ్బతీయడానికి పోలీసోడా?! అమలదాసుపురం మీద అమెరికా వాడి జులుమేమిటని మనమెవరన్నా అడగ్గలుగుతున్నామా? సరిగ్గా అలాగే ఉంది రాముడి మనస్థితి. హెడ్‌కానిస్టేబుల్‌ని తల్చుకుంటే రాముడికి కోపం రాలేదు. అసహ్యమూ రాలేదు. జాలి కలిగింది. తన పిల్లాడి స్కూలు ఫీజు కోసమో, పెళ్ళానికి నగలు చేయించడం కోసమో లంచాలు తీసుకుని అందుకు తన ఉద్యోగ ధర్మాన్ని ప్రక్కనబెట్టేసి, కాని పనులన్నీ చేస్తూ సాటి మనిషిపై జులుం చెలాయించడంలోని అమానుషం - రాముడిలో ఆ మనిషి పట్ల జాలిని పుట్టించింది. ఇది చిల్లుల పడవలాంటి ప్రస్తుత వ్యవస్థ తాలూకూ లోసుగు. డబ్బు తాలూకు లోసుగు. రాముడి చెంప మండుతోంది. అంతకు వందింతలుగా గుండె కూడా. సేదదీర్చే గోదారలల, రావాకుల సానుభూతి శబ్దం మినహా అంతటా ఆలోచనల నిశ్శబ్దం... ఎడతెగని ఆలోచనల నిశ్శబ్దం. ఎదవ బ్రతుకు! రోజూ చస్తూ బ్రతికే బ్రతుకెందుకు... చచ్చిపోదాం... అనుకున్నాడు.

అవతలి గట్టున జనం విషయం తెలుసుకున్నారు. నాటు పడవలింక రావని అర్థమైంది. హడావుడిగా మరపడవ నెక్కేరు. బరువు కంటే ఎక్కువ జనం. పడవ పట్టనంత జనంతో భారంగా బయల్దేరింది మరపడవ. పార్టీ కుర్రాళ్లు అక్కడే వున్నారింకా. పడవ బయల్దేరిన పది నిమిషాలకి జరిగిందది... ఓ కుర్రాడు హడావిడిగా హైరానాగా ఇసుక తిన్నె మీద నిలబడి చేతులూపుతూ అరుస్తున్నాడు... మర పడవని వెనక్కి రమ్మని... 'ఇక్కడో కుర్రాడు విషం తాగేడు ప్రమాదంగా ఉంది వెంటనే రండీ' అంటో గొంతు చించుకుంటో.

అంతకి పావుగంట క్రితం... పొదల మాటుకెళ్ళిన అన్వేష్... అప్పటి దాకా జేబులో దాచుకున్న సీసాలోని విషాన్ని తాగేసేడు పూర్తిగా. తిరిగొచ్చి మిత్రులతో కలిసేడు మామూలుగా. అతడికి ఉద్విగ్నంగా ఉంది. ముగించబోయే జీవితం... అతడిలో బ్రతుకు మీద ఆశ పుట్టిస్తోంది. కడుపులో త్రిప్పడం మొదలయిందప్పుడే. అతడికి బ్రతకాలనిపించింది. అప్పుడు చెప్పాడు ప్రక్క మిత్రుడితో 'రేయ్! సూరీ! నేను పాయిజన్ తీసుకున్నాన్రా! వెళ్ళిపోతున్నాను' అని.

'ఏవండీ! కాపాడండీ! హెడ్‌కానిస్టేబుల్ గారబ్బాయ్ అన్వేష్ విషం తాగేడు. చచ్చిపోతున్నాడు' అంటూ అరుస్తున్నాడు అవతలి రేవు కుర్రాడు. కూతవేటు దూరంలోనే వున్న లాంచీ మలుపు తిరిగింది. లాంచీ డ్రైవర్ ఎందుకైనా మంచిదని పల్లంశెట్టికి ఫోన్ చేసేడు.

'నేన్సార్! డ్రైవర్నండి! అవతలొడ్డున ఓ కుర్రాడు పాయిజన్ తీసుకుని చచ్చిపోయేలా ఉన్నాడంట. మన హెడ్డు నర్సింహ గారబ్బాయంట... మేం వెనక్కి వెళ్ళి తీసికొచ్చేద్దామని'

'మీరిప్పుడెక్కడున్నారు'

'గోదారి మధ్యలోనండి'

'కుర్రాడి పొజిషనేంటి?'

'సీరియస్సనుకుంటాన్సార్'

'అవును. ఇపుడే నర్సింహ కూడా నాకు ఫోన్ చేసేడు. ఓ పన్జెయ్. వెనక్కి త్రిప్పిన బోటు ఇంజన్ని ఆఫ్ చేసి... రిపేరని చెప్పు... ఓ అరగంటదాకా. పిల్లాడు చచ్చిపోయే దాకా' - లైను కట్టయింది.

* * *

నర్సింహ మనిషయ్యేడు. తండ్రయ్యేడు. ప్రేమ పుడుతోంది. మరపడవ మధ్యలో ఆగిపోయింది. నిండు గోదారి చాలా మామూలుగా ప్రవహిస్తోంది ఎప్పటిలాగే. రేవులో పడవలున్నా రవణా, వెంకటీ లేరు. ఉన్నవాడు రాముడొక్కడే.

'ఇదిగో! రాముడూ!' అన్నాడు నర్సింహ. ఇందాకటి దర్పమూ, అహమూ లేవా కంఠంలో.

రాముడు తలెత్తాడు. నర్సింహ ఏం అడగబోతున్నాడో తెలుసు రాముడికి. అడిగాక చేస్తే సహాయమే అవుతుంది గానీ మానవత్వం కాదన్న సంగతి రాముడికి తెలుసు. రాముడు ఇంకా మనిషే. పల్లెటూరి నాటు మనిషి.

పల్లెటూరు ఎప్పటికయినా పల్లెటూరే అయినట్టు రాముడు ఎప్పటికీ మానవత్వమున్న రాముడే.

నెమ్మదిగా నీళ్లలోకి దిగి పడవని నీళ్లలోకి త్రోశాడు. నర్సింహతోబాటూ మరో ఇద్దరు కానిస్టేబుళ్లతో పడవ బయల్దేరింది.... స్పీడుగా. నాటు పడవకి దారి మధ్యలో రేపేర్లు రావు. రాముడి మనసు నిండా ఆ పిల్లాడి రూపం మెదుల్తోంది. ఎహె! ఎదవ పాట? అని చికాకుపడ్డ కుర్రాడు... ఇప్పుడు మృత్యువు ముంగిట్లో పోరాటం చేస్తూ.

సరిగ్గా అదే సమయానికి - అనుకోని బీభత్సానికి అంకురార్పణ జరిగింది. ఇంతలో... ఆగిపోయిన మరపడవలో నిండుగా వున్న జనంలో కలకలం రేగింది... ఏదో ప్రమాదం ముంచుకొస్తుందన్న హడావుడి జనంలో ఉద్రిక్తత పుట్టించింది. అవతలి రేవులో ఆగిన పడవలోకి రాముడు అన్వేష్‌ని ఎక్కించేడు. మరపడవ జనాల గోలతో అటూ ఇటూ ఊగిపోతోంది. తోపులాట మొదలయింది. ఇద్దరు ప్రయాణీకులు ధబ్బుమని నీళ్లలో పడ్డారు. డ్రైవర్‌కేం అర్థం కాలేదు. అలవాటైన వ్యాపార లక్షణం ప్రకారం, నీళ్లల్లో పడిపోయిన వాళ్లని రక్షించే పని తనది కాదు. 'లైఫ్ బాయ్'లది. ఉద్యోగరీత్యా అతడి బాధ్యత లైఫ్ జాకెట్లు నీళ్లల్లోకి విసరడమంతే.

అయితే అదే మరపడవలో పన్జేస్తోన్న చిన్నపాటి ఉద్యోగస్థులు నిన్నటిదాకా నాటు పడవల మీద బతికిన వాళ్లు - వాళ్ల మాత్రం ఇంకా మనుషులుగానే ఉండడం చేత... ఏం ఆలోచించకుండా గోదారిలోకి దూకేరు. ఇద్దర్నీ రక్షించేరు. మరపడవ కూడా ఒడ్డుకు బయల్దేరింది.

రాముడు పడవని వొడ్డుకి చేర్చాడు. పడవలోనే వున్న హెడ్ నర్సింహ మాట పడిపోయిన వాడిలా ఉన్నాడు. శిలై పోయాడు. రాముడు మిగతా కానిస్టేబుళ్ల సహాయంతో ఆ కుర్రాణ్ని మెట్ల మీద పడుకోబెట్టాడు. నర్సింహ రాముడి వంక ఆప్యాయంగా చూడబోయేడు... రాముడు దయతో ఆ పిల్లాడి వంకే చూస్తున్నాడు. బహుశా గోదారి తల్లికి మొక్కుకుంటున్నాడేమో కూడా... ఆ పిల్లాణ్ని బ్రతికిస్తే ముడుపు కడతానని.

'ఇందాకా ఆ నాటుపడవోణ్ని కొట్టిన హెడ్డు కానిస్టేబుల్ గారి కొడుకేనంట ఈ కుర్రాడు' ఎవరో అంటున్నారు. అప్పుడు చూసేడు నర్సింహ మొహం వంక రాముడు - గోదార్లోనో, అవతలో ఏవన్నా అయితే ఏం చేయగల్రా మీరు?' అన్న ప్రశ్నకి సమాధానంగా ఆ పిల్లాణ్ని చూపించి - 'నీ చదువు గొప్పల తిప్పలతో విసిగిపోయి ఇప్పుడు విషం తాగిన ఈ పిల్లాణ్ని ఎలా రక్షిస్తావురా?' అని అడుగుతున్నాయా చూపులు అదే ప్రశ్న... జీవితం మధ్యలో ఏవన్నా అయితే ఏం చేస్తార్రా మీరు? అని పల్లెటూరు అడుగుతున్నట్టు... అప్పటిదాకా అవమాన భారాన్ని భరించలేక చచ్చిపోదామనుకున్న రాముడు ఇప్పుడు నాశనం కావడానికే మాత్రం ఇష్టంలేని పల్లె సంప్రదాయంలా ఉన్నాడు. తన వరకు చేయగలిగిన దంతా యువతరానికి సాయపడడానికి దేవుడెత్తిన అవతారంలా ఉన్నాడు.


అనాగరిక మానవ జీవనాన్ని సంఘ జీవితంగా మార్చి పరిమళింపజేసిన పల్లె సంప్రదాయంలా నాటుపడవ అలల ఊయల లూగుతోంది రేవులో. ఎన్ని తుఫానులొచ్చినా నిటారుగా నిలువెత్తున నిలబడ్డ రావిచెట్టులా గల గల లాడుతోన్న మానవత్వంతో వెలిగిపోతున్నాడు రాముడు. ఒక మంచి పని చేసిన తృప్తితో గుండె మంట తగ్గింది.

'పిల్లాణ్ని ఆసుపత్రికి తీసికెళ్ళండి' అంటున్నారెవరో.

హెడ్ నర్సింహ రాముడితో ఏదో చెప్పబోతున్నాడు - నిద్రోతోన్న గంగమ్మని భుజానేసుకుని ఏమీ మాట్లాడకుండా నిశ్శబ్దంగా రేవు మెట్లెక్కి చీకటిపైని వెలుగులోకి సాగిపోయేడు రాముడు. ★

# జంతువులకది మృత్యుగుహ

ఇటలీలోని నేపుల్స్ నగరం సరిహద్దులో ఉన్న ఒక గుహ మృత్యుగుహగా పేరుపడింది. ఆ గుహలోకి వెళ్ళే వాళ్ళలో మనుషులు తప్ప మిగతావేవీ బతకడం లేదు.లోపలికి వెళ్ళిన కొన్ని నిముషాలకే చనిపోతాయి. ఏగ్నానో చెరువు ఒడ్డున ఉన్న ఈ గుహ శాస్త్రవేత్తలకు ఒక సవాలుగా పరిణమించింది. ఈ గుహను చూడటానికి ఇటలీ నలు మూలల నుంచి అనేక మంది రోజూ వస్తుంటారు. అయితే జంతువులేవీ ఈ గుహ దరిదాపులకు కూడా రాకపోవడం విశేషం.



ఒక సారి ఒక పర్యాటకుడు తన కుక్కతో సహా ఈ గుహదగ్గరకి వచ్చాడు. గుహలోకి వెళ్ళబోతోంటే కుక్క మొరాయించింది.గుహలోకి వెళ్ళడానికి అది అసలు ఇష్టపడలేదు. విచిత్రంగా అనిపించినా ఆ పర్యాటకుడు బలవంతంగా కుక్కను గుహలోకి తీసుకు వెళ్ళాడు. లోపలికి వెళ్ళిన మూడు నిముషాలకే ఆ కుక్క గిలగిల కొట్టుకుంటూ ప్రాణాలు విడిచింది.కుక్క గుహలోకి వెళ్ళడానికి మొరాయించడం, తీరా వెళ్ళాకా నిముషాల్లోనే ప్రాణాలు విడవడం అందరికీ ఆశ్చర్యం కలిగించింది. మనుషులు ఎంత సేపు గుహలో ఉన్నా ఏమీ కాకపోవడం కూడా విచిత్రమనిపించింది. కొన్ని అనుభవాల తర్వాత ఆ గుహలో నేలకు కొంచెం ఎత్తులో ఉన్న ప్రాణులకు ప్రాణహాని తప్పదన్న నిర్ణయానికి వచ్చారు. దానిని నిర్ధారించుకోవడం కోసం ఒక పెద్ద పామును గుహలోకి వదిలారు. తొమ్మిది నిముషాల పాటు గుహలో ఉన్న పాము తర్వాత తల బాగా పైకెత్తిసాధారణంగా పీల్చుకునే గాలికి రెట్టింపు గాలి పీల్చుకుంది. మరుక్షణం తల వాల్చేసింది.1494లో నేపుల్స్‌ను జయించిన ఫ్రాన్స్‌రాజు ఎనిమిదవ చార్లెస్‌కు ఈ గుహ సంగతి తెలిసింది. ఒక గాడిదను ఆ గుహలోకి పంపాడు. కొద్ది సేపటికే అది మరణించింది. మరోసారి ఇద్దరు బానిసలను గొలుసులతో బంధించి ఆ గుహలో నేలపై పడుకోబెట్టారు. కొన్ని నిముషాలకే వారిద్దరూ మరణించారు. ఇక నేపుల్స్ వైస్ రాయ్ అయితే మరణ దండనకు గురైన వారిని ఆ గుహలోకి పంపి పడుకోబెట్టించడం ద్వారా శిక్ష అమలు చేసేవాడు. ఆ గుహలో జంతువులు మాత్రమే మరణిస్తున్నాయని తెలుసుకున్న ఆ వైస్ రాయ్ ఏ జంతువు ఎంత సేపు ఆ గుహలో బతుకుతుందోకూడా లెక్కగట్టారు. ఆ గుహలో కెళ్ళిన కుక్కలు మూడు నిముషాల్లోనూ, పిల్లులు నాలుగు నిముషాల్లోనూ,కుందేళ్ళు75 సెకన్లలోనూ మరణిస్తాయని తెలుసుకున్నాడు. ఈ గుహ రహస్యాన్ని శోధించడానికి శాస్త్రవేత్తలు నడుం కట్టారు. వారి పరిశోధనలో ఆ గుహలో నేల మీద పది అంగుళాల ఎత్తు వరకు ప్రాణాంతకమైన విష వాయువు వ్యాపించి ఉందని వారి పరిశోధనల్లో తేలింది. గుహ అంతటా సమానంగా వ్యాపించి ఉన్న ఈ విష వాయువులో 70శాతం కార్బన్ డై ఆక్సైడ్,7శాతం ప్రాణ వాయువు, 23శాతం ఇతర వాయువులు ఉన్నాయని తేల్చారు. గాలిలో కార్బన్ డై ఆక్సైడ్ 20శాతానికి మించి ఉంటే అది విష వాయువుగా మారుతుంది. కాబట్టి ఆ గుహలో నేల మీద వ్యాపించిన గాలి పీల్చి జంతువులు చనిపోయేవి.గాలి కన్నా కార్బన్డై ఆక్సైడ్ వాయుడు ఒకటిన్నర రెట్లు బరువు కాబట్టి ఈ వాయువు గుహలో ఎప్పుడూ కింది భాగంలోనే ఉంటోందని నిర్ధారించారు. ఆ గుహ దిగువన గతంలో అగ్ని పర్వతాలు ఉండేవని,భూ అంతర్భాగంలో జరిగే రసాయన చర్యల ఫలితంగా హెచ్చు పీడనంలో అర్బన్డై ఆక్సైడ్ వెలువడి నెర్రల గుండా గుహలోకి వస్తోందని శాస్త్రవేత్తలు కనుగొన్నారు. ఎన్ని ప్రయత్నాలు చేసినా ఆ వాయువు వెలువడటాన్ని మాత్రం ఆపలేకపోయారు. దాంతో ఇప్పటికీ ఆ గుహను మృత్యుగుహగానే పిలుస్తున్నారు.

-సి.వి. సర్వేశ్వర శర్మ